సాక్షి
హనుమకొండ

గురువారం | 24 | ఏప్రిల్ | 2025



కాజీపేటకు ప్రాముఖ్యత ఇవ్వాలి

కాజీపేట రైల్వే జంక్షన్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరుతూ వరంగల్ ఎంపీ కావ్య.. దక్షిణమధ్య రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. -10లో▸



విద్యాప్రగతిపై సమీక్ష

హనుమకొండ జిల్లాలో విద్యాప్రగతి, కార్యక్రమాలపై బుధవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ మురళి.. కలెక్టర్ ప్రావీణ్య, అధికారులతో సమీక్షించారు. -10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $41^0/25^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ వడగాలులతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జి పట్టాభిరామారావు బాధ్యతల స్వీకరణ



వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభిరామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, రవి నేతృత్వంలో కార్యవర్గం.. న్యాయమూర్తి పట్టాభి రామారావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

వేయిస్తంభాల ఆలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.పట్టాభి రామారావు బుధవారం రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని ఆయన కుటుంబసమేతంగా సందర్శించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. న్యాయమూర్తి దంపతులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ఈఓ అనిల్‌కుమార్, సిబ్బంది మధుకర్, అర్చకులు గంగు మణికంఠశర్మ, సందీప్‌శర్మ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి..



హన్మకొండ చౌరస్తా: ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు శ్రద్ధతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డులతో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసమావేశంలో ముందుగా సిబ్బంది శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సిబ్బంది సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పరిపాలనా విభాగాధికారులను అడిగి తెలుసుకుని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ విభాగంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది చాలా కీలకమన్నారు. మీకు శాఖాపరమైన లేదా వ్యక్తిగత సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీలైనంత వరకు సదరు అధికారులు సమస్యలు పరిష్కరిస్తారని, పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటారని సూచించారు. ఈసమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్, ఏఎస్పీ మనన్‌భట్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, ఆర్‌లు పాల్గొన్నారు.

జూన్ 6నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల (నాన్‌ప్రొఫెషనల్) సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) జూన్ 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య బుధవారం తెలిపారు. ఈనెల 26 నుంచి నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. రీషెడ్యూల్ చేస్తూ బుధవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. జూన్ 6, 9, 11, 13, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షలు వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు. పూర్తి వివరాలు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో జాతీయ భావం పెంచాలి



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో జాతీయ భావం పెంచాలని జిల్లా సెక్టోరియల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. 'ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్' ఛాయ చిత్ర ప్రదర్శనను హనుమకొండలోని జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆపాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డితో కలిసి సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణసుధాకర్, ప్రేమలతారెడ్డి, అపూర్వరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరకాల.. దూపైతే ఉరకాలా?

నాలుగురోజులకోసారి మిషన్ భగీరథ నీరు

- నన్నటి ధార.. పది బిందెల వరకే పానీ..
- బోర్లు.. బావుల వద్దకు జనాల పరుగులు
- చలివాగు చెక్‌డ్యాం ఉన్నా.. తీరని దాహార్తి
- నీటి కష్టాలపై 'సాక్షి' ఫోకస్



పరకాల: ఎండలు మండుతున్నాయి. జలాశయాలు అడుగంటుతున్నాయి. వేసవి నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. పరకాల పట్టణ ప్రజలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. పట్టణంలో నాలుగు రోజులకోసారి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. అవి కూడా 10 బిందెల వరకు మాత్రమే. దీంతో బోర్లు, బావుల వద్దకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. చెరువును తలాపున పెట్టుకుని.. చేప దూపకు ఏడ్చినట్లు పరకాల ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ఓవైపు చలివాగు చెక్‌డ్యాం నీళ్లు ఉన్నా.. మిషన్ భగీరథ నీళ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెక్‌డ్యాం వద్ద ఉన్న పంప్ హౌస్ నుంచి పట్టణంలోని నాలుగు వాటర్‌ట్యాంకులకు ఉన్న పైప్ లైన్‌ను మిషన్ భగీరథ పథకం వచ్చిన తర్వాత వినియోగించకుండా ఉంచారు. పథకం మొదలవ్వక ముందు పరకాల ప్రజల అవసరాలకు, దాహార్తి తీర్చేందుకు చలివాగు చెక్‌డ్యాం నీరు ఉపయోగపడేది. మిషన్ భగీరథ పథకం వచ్చిన తర్వాత కేవలం అరగంట మాత్రమే నీటిని విడుదల చేసి నిలిపేయడం వల్ల స్థానికులు మంచినీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

నిరుపయోగంగా మినీ ట్యాంకులు..

మున్సిపాలిటీ పరిధి పలు వార్డుల్లో 20 ఏళ్ల క్రితం ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంకు(10 వేల లీటర్ల సామర్థ్యం)లను నిర్మించింది. ఆయా ట్యాంకులకు వేసవి నీటి ఎద్దడి సమయంలో చలివాగు పంప్ హౌస్ ద్వారా వచ్చే నీటితో నింపేవారు. 'మిషన్ భగీరథ' వచ్చిన తర్వాత ఆయా ట్యాంకులు నిరుపయోగంగా మారాయి.



నీటితో నిండుగా ఉన్న చలివాగు చెక్‌డ్యామ్

మరమ్మతులకు నోచుకోని బోర్లు



పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉండగా.. వాటి పరిధిలో ఒక్కో కాలనీకి.. ఒక్కో బోరు ఉంది. వాటిలో చాలా వరకు మరమ్మతులకు నోచుకోలేదు. మున్సిపాలిటీ సిబ్బంది నాలుగు బోర్లు మాత్రమే మరమ్మతులు చేసినప్పటికీ వాటిలో మూడు మాత్రమే మళ్లీ ఉపయోగంలోకి వచ్చాయి. మిషన్ భగీరథ నీళ్లు సరిపోక స్థానికులు బోర్లు, బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాలనీ అంతటికీ సర్కారు బావే..



పట్టణంలోని 1, 2, 1, 3 వార్డుల్లోని ఎస్సీ కాలనీకి సర్కారు బావి 50 ఏళ్లుగా దిక్కుగా మారింది. ఒకే బావికి పదుల కొద్ది మోటార్లు బిగించుకుని కాలనీవాసులు మంచినీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈబావి లేకపోతే తమ పరిస్థితి ఏంటని ఎస్సీ కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పక్క కాలనీకి వెళ్లి తెచ్చుకుంటున్నాం..



మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రాకపోవడంతో పక్క కాలనీ బోరు దగ్గరకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఎండకు నీళ్లు మోయాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు పట్టించుకుని మా కష్టాలు తీర్చాలి. నల్లా నీళ్లు రోజూ నీళ్లు వదలాలి.

- లలిత, 13వ వార్డు, ఎస్సీ కాలనీ, పరకాల



వేసవిలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం..

పరకాల మున్సిపాలిటీ పరిధిలో మంచి నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. బోర్లు మరమ్మతులు చేయిస్తున్నాం. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చలివాగు చెక్‌డ్యాం నీటిని పట్టణ ప్రజలకు ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- సీహెచ్.వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పరకాల

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంట్లో ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



టార్గెట్ 2.50 లక్షలపైనే..

జనసమీకరణపై నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం

- ఓరుగల్లులో ప్రతీ ఇంటి నుంచి జనం కదలాలే..
- సిల్వర్ జూబ్లీ వేడుకలు మళ్లీ మళ్లీ రావు.. రజతోత్సవ సభ దద్దరిల్లాలని పిలుపు
- సుమారు నాలుగు గంటల పాటు సమీక్ష.. కీలక అంశాలపై చర్చ
- సభా వేదిక, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లపై అభినందనలు

సాక్షిప్రతినిధి, వరంగల్ : 'బీఆర్‌ఎస్ 14 ఏళ్ల రాష్ట్ర సాధన పోరాటం, సాధించిన రాష్ట్రంలో పదేళ్ల అద్భుత పాలన.. పార్టీని తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలం చేశాయి. అలాంటి పార్టీ 25 సంవత్సరాల వేడుకలు నిర్వహించుకుంటున్నాం. సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించే అవకాశం మళ్లీ మళ్లీ రాదు.. రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు హాజరయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్కతుర్తిలో రజతోత్సవ సభావేదిక ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన హనుమకొండ రాంనగర్‌లోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంట్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పాతికేళ్ల పండుగ సభకు ఉమ్మడి వరంగల్‌నుంచి 2.50 లక్షల మందికి పైగా హాజరయ్యేలా చూడాలని కోరారు. ప్రతీ నియోజకవర్గంనుంచి 25 వేల మందికి తగ్గకుండా.. ఉమ్మడి వరంగల్‌లోని ప్రతీ గడపనుంచి జనాలను కదిలించాలని సూచించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈనెల 27న నిర్వహించే సభకు సాయంత్రం 4.30 గంటల్లోపే చేరుకుంటారని, ఆలోగా.. ప్రజలు సభావేదిక వద్దకు చేరేలా ప్లాన్ చేయాలన్నారు.

ఒక్కొక్కరిగా జన సమీకరణపై ఆరా..

మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇన్‌చార్జులు పాల్గొన్న ఈ సమీక్షలో జన సమీకరణపై ఇప్పటి వరకు అమలు చేసిన కార్యాచరణపై నియోజకవర్గాల వారీగా కేటీఆర్ ఆరా తీసినట్లు తెలిసింది. ఈమేరకు 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న నేతలను అడిగి తెలుసుకున్న ఆయన పలు సూచనలు చేసినట్లు సమాచారం. వాహనాల కొరత లేకుండా.. ట్రాఫిక్ సమస్య రాకుండా చూడడంతోపాటు జనం ఇబ్బంది పడకుండా చూడాలని, ఒక్కో వాహనానికి ఇన్‌చార్జ్‌ను నియమించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జన సమీకరణ, జనం తరలింపుపై ఫోన్ల ద్వారా సమీక్షించనున్నట్లు, అందరూ తమ లక్ష్యాలను చేరుకోవాలని కోరారు.

సభా ఏర్పాట్లపై నాయకులకు అభినందనలు..

ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు తక్కువ సమయంలో ఏర్పాట్లు జరిగాయన్న కేటీఆర్.. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. సభ కోసం 1,250 ఎకరాలను ఇచ్చిన రైతులకు ఆయన ధన్యవాదాలు తెలియజేస్తూ.. భూసేకరణ కోసం రైతులను ఒప్పించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. సమీక్షలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు డాక్టర్ బండా ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ గార్డెన్ జంక్షన్‌లో..

అదాలత్ జంక్షన్‌లో..

నీడ తెర

గ్రేటర్ వరంగల్ నగరంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వాహనదారులు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడితే ఎర్రటి ఎండలో చుక్కలు చూస్తున్నారు. వీరికి కాసింత నీడ కోసం బల్దియా అధికారులు పలు సిగ్నల్ జంక్షన్ల వద్ద నీడ తెరలు ఏర్పాటు చేశారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఆ నీడన ఆగుతూ ఉపశమనం పొందుతున్నారు. కానీ, నీడ కొందరికే సరిపోతుందని, మిగతా వారంతా ఎండలోనే ఉండాల్సి వస్తుందని వాహనదారులు అంటున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

పెరుగుతున్న ఎండలు.. తస్మాత్ జాగ్రత్త

- తగిన జాగ్రత్తలు పాటించాలి
- హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య



డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం : ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలు తగ్గించాలని, ఏదైనా అత్యవసర పని ఉంటే తప్ప బయటికి వెళ్లకూడదని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన నగరవాసులకు, జిల్లా ప్రజలకు పలు సూచనలు చేశారు.

సూచనలు ఇలా..

- మంచినీటిని ఎక్కువ మొత్తంలో తీసుకోవాలి. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత మంచినీరు తాగాలి. అదేవిధంగా కొబ్బరినీళ్లు, మజ్జిగ, పండ్ల రసాల వంటి ద్రవపదార్థాలు తీసుకోవచ్చు.



- వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలు బయట ఆడడానికి ఎక్కువ ఉత్సాహం చూపిస్తారు. వారిని ఉదయం లేదా సాయంత్రం పూటనే ఆడుకోవడానికి అనుమతించాలి.
- ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలి. అదేవిధంగా చెవులకు వేడి గాలి తగలకుండా తలకు నిండుగా రుమాలు కానీ, ఖర్చీఫ్ కానీ చుట్టుకోవాలి.
- గొడుగు, టోపీ, రుమాలు లేదా.. ఇతర రక్షణ చర్యలు తీసుకోకుండా ఎండలో పనిచేసేవారు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. సన్నని, వదులుగా, లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిది.
- వడదెబ్బ తగిలిన వారిలో శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం, నాలుక ఎండిపోవడం పాక్షిక లేదా అపస్మారక స్థితికి లోనయ్యే అవకాశం ఉంటుంది. పొడిచర్మం, చిరాకు, తలనొప్పి, శ్వాస పెరగడం, వికారం, వాంతులు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపించిన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి చేర్చాలి. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్నంత తరచూ తుడుస్తూ ఉండాలి. వారికి కొబ్బరి నీళ్లు లేదా ఓఆర్ఎస్ ద్రావణం లేదా కొంచెం ఉప్పు కలిపిన మజ్జిగను తాగిస్తూ ఉండాలి. పరిస్థితి గమనిస్తూ అవసరమైతే 108 వాహనం ద్వారా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తప్పకుండా తీసుకువెళ్లాలి.
- ఉపాధి హామీ కార్మికుల విషయంలో సంబంధిత సిబ్బంది తగు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉదయం లేదా సాయంత్రం నాలుగు తర్వాతనే వారితో పని చేయించాలి. వారికి అవసరమైన మంచినీరు, సేద తీరడానికి నీడ వసతి ఏర్పాటు చేయాలి.

పూడికతీత పనుల్లో వేగం పెంచండి

హన్మకొండ కల్చరల్: భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూడికతీత లక్ష్యం కాగా ఇప్పటి వరకు చెరువులో రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూడిక తీసినట్లు అధికారులు కమిషనర్‌కు వివరించారు. నిర్దేశిత గడువులోగా పూడికతీత పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో 'కుడా' ప్రాజెక్టు అధికారి అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ

జిమ్ నిర్వాహకులకు అవగాహన

హన్మకొండ చౌరస్తా: నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు, ఎస్పీ రూపేష్ పర్యవేక్షణలో వరంగల్ నగరంలోని జిమ్ యాజమానులు, కోచ్‌లకు సింథటిక్ ఇంజక్షన్, స్టెరాయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై నార్కొటిక్స్ పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఎవరైనా స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిమ్ రికార్డుల నిర్వహణ, గంజాయి, ఇతర డ్రగ్స్ కొనుగోలు, అమ్మకాల రవాణా, వాడకం, స్టెరాయిడ్స్ వాడకం వలన జరిగే కలిగే దుష్పరిణామాలపై వివరించారు. వినియోగదారుల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని, జిమ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ అమ్మకాలు, కొనుగోలు సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1908, మొబైల్ నంబర్ 87126 71111లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నార్కొటిక్స్ పీఎస్ డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపీ, నార్కొటిక్ పీఎస్ ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నార్కొటిక్స్ పోలీసులు

జిల్లాలకు పీసీసీ పరిశీలకుల నియామకం

హన్మకొండ చౌరస్తా: ఇటీవల అహ్మదాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ చేసిన తీర్మానం మేరకు మొదటిసారిగా తెలంగాణలో పార్టీ జిల్లాల వారీగా పీసీసీ పరిశీలకులను నియమించింది. ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పరిశీలకులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఒక్కో జిల్లాకు ఇద్దరు పరిశీలకులను నియమించిన పీసీసీ చీఫ్ హనుమకొండ జిల్లా పరిశీలకులుగా కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మసూద్ అహ్మద్, వరంగల్ జిల్లాకు అమీర్‌అలీఖాన్, మేడి రవిచంద్రను నియమించారు. కాగా.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావును ఖమ్మం జిల్లా పరిశీలకులుగా, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్‌ను కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, జంగా రాఘవరెడ్డిని మంచిర్యాల జిల్లా పరిశీలకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అంతర్గత నిర్మాణం కోసం వివిధ విభాగాల్లో నూతన కమిటీల నియామకం, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ బలోపేతం పరిశీలకులు ఆ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ప్రజాప్రతినిధులను కలుపుకుని పని చేయాలని పేర్కొన్నారు.

కోర్టు కోసం సెరికల్చర్ భవనం ఎంపిక

ఎల్కతుర్తి: ఎల్కతుర్తికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మొదటి తరగతి న్యాయస్థానం ఏర్పాటు కోసం సెరికల్చర్ భవనాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఈమేరకు కలెక్టర్ ప్రావీణ్య స్థానిక తహసీల్దార్‌కు భవన విస్తీర్ణం, కోర్టుకు కావాల్సిన సదుపాయాల గురించి తెలపాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ జగత్‌సింగ్ బిల్డింగ్‌లో ఉన్న సదుపాయాలపై ఆర్డీఓ రమేశ్ రాథోడ్‌కు నివేదిక ఇచ్చారు. సెరికల్చర్ భవనం సుమారుగా 2,798 అడుగుల విస్తీర్ణంలో ఉందని, బిల్డింగ్‌కు కొన్ని మరమ్మతులు చేయాల్సి ఉంటుందని చెప్పారు. తలుపులు, కిటికీలు మార్చాలని, మరుగుదొడ్లు లేవని, ఎల్కతుర్తి శివారులో ఉందని ఆర్డీఓకు తహసీల్దార్ నివేదించారు. దీంతో కొత్తగా మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ 1–క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కోసం భవనాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రిన్సిపాల్ జడ్జికి విన్నవించినట్లు తెలిసింది. ఈమేరకు సెరికల్చర్ భవనాన్ని జిల్లా ప్రిన్సిపల్ జడ్జికి అప్పగించాల్సిందిగా.. కలెక్టర్ ప్రావీణ్య తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎల్కతుర్తిలో కోర్టు ఏర్పడుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

ఎల్కతుర్తి: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయిల్‌పామ్ జిల్లా మేనేజర్ రంజిత్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి మండలం దామెరలో చల్ల లక్ష్మి సమ్మిరెడ్డి పంట క్షేత్రంలో పరాగ సంపర్కానికి సంబంధించిన కీటకాలను విడుదల చేశారు. ఈసందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంట ప్రోత్సాహానికి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీని వినియోగించుకోవాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులు 90 శాతం రాయితీ పొందవచ్చని సూచించారు. రైతులు సాగుకు ముందుకు రావాలని, అధిక లాభాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో బయోసైన్సెస్ ఫీల్డ్ ఆఫీసర్లు విక్రమ్, మహిపాల్, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటలో పరాగ సంపర్కానికి సంబంధించిన కీటకాలను విడుదల చేస్తున్న జిల్లా మేనేజర్ రంజిత్

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కాజీపేటకు ప్రాముఖ్యత ఇవ్వాలి



రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో ఎంపీలు రఘురాంరెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి

కాజీపేట రూరల్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను హైదరాబాద్‌లోని రైలు నిలయంలో బుధవారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కలిశారు. పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ రైల్వే సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. కాజీపేట బస్టాండ్ విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని, అమృత్‌భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని, రైల్వే క్రూలింక్‌ల తరలింపు విషయంలో వివరణ, రైల్వే యూనియన్ల నాయకులతో సమావేశమై వారి సమస్యలు పరిష్కరించాలని జీఎంను కోరారు. మూడు రోజుల్లో నాయకులతో సమావేశం కానున్నట్లు జీఎం చెప్పారని ఎంపీ తెలిపారు. కాజీపేట లోకోరన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడ డిపోనకు బదిలీ చేయడం, కాజీపేటలో కొత్త పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడంపై జీఎంను వివరణ కోరినట్లు తెలిపారు. కాజీపేటలో 709 మంది ఉద్యోగులకు 526మంది ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారని, రన్నింగ్‌స్టాఫ్‌లో 184 కొత్త పోస్టింగ్‌లు మంజూరైన పోస్టుల భర్తీకి ఎలాంటి ప్రయత్నాలూ లేవని, దీంతో ఉద్యోగులపై పనిభారం పడుతుందని జీఎంకు వివరించారు. 2022 జూలై 14న రైల్వే అధికారులతో జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో రైల్వే అథారిటీ ఇచ్చిన హామీలను ఉల్లంఘించి కృష్ణా, ఎల్‌టీటీ, కోణార్క్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లను కాజీపేట నుంచి విజయవాడ డిపోనకు తరలిస్తున్నారన్నారు. కాజీపేట డివిజన్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని జీఎంను కోరినట్లు తెలిపారు. ప్రస్తావించిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని జీఎం హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు. ఎంపీలు రఘురాంరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో సూట్‌కేస్ కలకలం



సూట్‌కేస్‌ను తెరిచి పరిశీలిస్తున్న పోలీసులు

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని సబ్ కోర్టు ఎదుట బుధవారం అనుమానాస్పదంగా ఉన్న ఓ సూట్‌కేస్ కలకలం రేపింది. ఎవరిదో తెలియకపోవడంతో అప్రమత్తమైన కోర్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏసీపీ దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో బాంబు అండ్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది సూట్‌కేస్‌ను పరిశీలించారు. దానిని తెరిచి చూడగా ఏమి లేకపోవడంతో కోర్టు యంత్రాంగం, న్యాయవాదులు, కక్షిదారులు ఊపిరి పీల్చుకున్నారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ లైంగిక దాడి కేసులో బాధితురాలు విచారణ నిమిత్తం బుధవారం కోర్టుకు హాజరైంది. సదరు బాధితురాలు వికలాంగురాలు కావడంతో వెంట తెచ్చుకున్న సూట్‌కేసును సబ్ కోర్టు ఎదుట కింద ఉంచి పై అంతస్తులో ఉన్న హనుమకొండ మొదటి జిల్లా అదనపు కోర్టులో విచారణకు హాజరైంది. ఈ క్రమంలో గంటల తరబడి సూట్‌కేస్ వద్ద ఎవరూ లేకపోవడంతో అనుమానించిన కోర్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఈనెల 4న కోర్టు ప్రాంగణంలో బాంబ్‌లు అమర్చినట్లు ఉభయ జిల్లాల అధికారికి, ఈ మెయిల్‌కు తమిళనాడు లిబరేషన్ ఆర్మీ పేరున మెయిల్ అందిన విషయం తెలిసిందే.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

WANTED
• కంప్యూటర్ ఆపరేటర్ (Female) మంచి ఇంగ్లీష్, పూర్తి కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం కలిగినవారు
• అకౌంటెంట్ (Male / Female) అకౌంట్స్ & కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన అనుభవం గల వారు కావలెను
• కన్‌స్ట్రక్షన్ వాచ్‌మెన్ & డ్రైవింగ్ వచ్చిన సూపర్‌వైజర్ కావలెను
• వెంచర్‌లో పనిచేయుటకు భార్యా భర్తలు కావలెను
Walk in interview Time: 10 am to 1 pm 4 pm to 7 pm
సుష్మిత మార్కెటింగ్
Domino's పిజ్జా లైన్, ఫారెస్ట్ ఆఫీస్ ప్రక్కన, శ్రీసాయి కాలనీ, సుబేదారి, హన్మకొండ.
9866242881, 9346997259, 9985012021

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర।। డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1265086]

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393937 [HA-453]

WANTED
■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA25002882]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ।। 260/- అదనపు లైను రూ।। 60/- మాత్రమే 5% GST అదనము

■ In a Famous University Wanted Tele callers. Qualification any Graduation Part Time / Full Time Available. First Preference for Experienced Candidates. Contact ✆ 79958 64165 [B-29]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'వడదెబ్బ' బాధితులకు భరోసా!

మృతుల కుటుంబాలకు పరిహారం పెంపు

- గతంలో రూ. 50 వేలు.. ప్రస్తుతం రూ.4లక్షలు
- పోస్టుమార్టం రిపోర్టు తప్పనిసరి
- మృతిపై సమాచారం అందించాలి
- త్రిసభ్య కమిటీ, కలెక్టర్ నివేదిక ఆధారంగా పరిహారం చెల్లింపులు



సంగెం/కాజీపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడగాలులను ప్రత్యేక విపత్తుగా పరిగణించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర విపత్తుల నివారణ విభాగం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వేసవిలో వడదెబ్బతో అనేక మంది ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందజేస్తోంది. ఇందుకోసం త్రిసభ్య కమిటీ పనిచేస్తోంది. ఈ కమిటీ వడదెబ్బతో చనిపోయిన వారి వివరాల నివేదికను కలెక్టర్‌కు పంపిస్తుంది. కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఇప్పటి వరకు ఆపద్బంధు పథకం కింద రూ. 50 వేల పరిహారం చెల్లిస్తుండగా, ప్రభుత్వం ఇటీవల ఆ మొత్తాన్ని రూ. 4 లక్షలకు పెంచింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అవగాహన లోపంతో పరిహారానికి దూరం..

వేసవిలో ఎండల తీవ్రతకు ఏటా పలుచోట్ల వృద్ధులు, రైతులు, హమాలీలు, ఉపాధిహామీ, వ్యవసాయ కూలీలు, ఇతర కార్మికులు వడదెబ్బకు గురవుతున్నారు. సకాలంలో చికిత్స అందక పలువురు మృతి చెందుతున్నారు. వీరికి గతంలో ప్రభుత్వం ఆపద్బంధు పథకం కింద రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించేది. అధికారులు అందజేసిన నివేదిక ఆధారంగా అర్హుల జాబితా వరుస క్రమంలో నిధుల లభ్యతను బట్టి సాయం అందించేవారు. ఆపద్బంధు పథకం కింద ప్రమాదవశాత్తు మరణించినా, వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు దరఖాస్తులు చేసుకునేవారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ పథకం నిలిచిపోయిందనే చెప్పొచ్చు. సాయం అందకపోవడం, పరిహారం తక్కువ ఉండడం, పోస్టుమార్టం వ్యయప్రయాసాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం పరిహారం పెంచిన నేపథ్యంలో బాధితుల కుటుంబసభ్యులు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. కాగా, వడదెబ్బతో మృతి చెందిన వ్యక్తి పేరిట రైతుబీమా ఉంటే రెండింటిలో ఒక పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్నాం



వడదెబ్బ మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పరిహారం పెంచింది. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలి. కొనుగోలు కేంద్రాలు, ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. వైద్యశాఖ ద్వారా వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా వడదెబ్బతో మృతి చెందితే త్రిసభ్య కమిటీకి తెలపాలి. నిబంధనల మేరకు బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూస్తాం.

-గనిపాక రాజ్‌కుమార్, తహసీల్దార్, సంగెం

ఇవీ నిబంధనలు...

- వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం అందించడం మృతుల కుటుంబాలకు కాస్త ఊరట కలిగించే అంశమే.
- ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి వడగాలులు వీస్తున్న రోజులనే ప్రత్యేక విపత్తుగా పరిగణనలోకి తీసుకుంటారు.
- వడదెబ్బతో అస్వస్థతకు గురై మరణిస్తే తహసీల్దార్, వైద్యాధికారి, ఎస్సైతో కూడిన మండలస్థాయి త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలి.
- మృతుల కుటుంబ సభ్యులు ముందు ఈ కమిటీకి సమాచారం ఇవ్వాలి.
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీస్ శాఖ అనుమతితో మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో తహసీల్దార్ సమక్షంలో శవపరీక్ష నిర్వహించాలి.
- ఆ వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు ముందు వైద్యాధికారి ధ్రువీకరించాలి.
- అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి సమీపంలోని ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించాలి.
- పోస్టుమార్టం నివేదికను వైద్యాధికారి పోలీసుస్టేషన్‌కు అందజేస్తే ఎఫ్ఐఆర్ ఆధారంగా వడదెబ్బ మృతిగా నిర్ధారిస్తారు.
- అనంతరం డెత్ సర్టిఫికెట్, నామినీ వివరాలను మండల కమిటీకి అందించాలి.
- పూర్తిస్థాయిలో విచారణ చేసి మండలస్థాయి కమిటీ సిద్ధం చేసిన నివేదికలను జిల్లా వైద్యాధికారి పరిశీలించి కలెక్టర్‌కు సమర్పించాలి.
- ఆ నివేదికను కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వానికి పంపితే పరిహారం అందుతుంది.

వడదెబ్బతో ముగ్గురి మృతి

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ ఆవరణలోని బస్టాండ్‌లో బుధవారం ఓ గుర్తుతెలియని వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందాడు. రైల్వే పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించే వ్యక్తి వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వయసు సుమారు 65 ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి భద్రపర్చినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. వివరాలకు 87126-85122 నంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ కోరారు.

తిమ్మంపేటలో మహిళ ..

దుగ్గొండి: వడదెబ్బతో ఓ మహిల మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తిమ్మంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన నాంపల్లి రవళి అలియాస్ కల్పన (35) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తన ఇంటి పెరటితోటలో పనులు చేసింది. అనంతరం ఇంట్లోకి వచ్చిన కొద్ది సమయం తర్వాత అస్వస్థతకు గురైంది. దీంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజేందర్, ఇద్దరు కూతుళ్లు జ్యోతిప్రియ, లక్ష్మీప్రసన్న ఉన్నారు.



కల్పన(ఫైల్)

ఘన్‌పూర్‌లో మరో మహిళ..

స్టేషన్‌ఘన్‌పూర్: వడదెబ్బతో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన పులి రమ(50) మృతిచెందింది. మృతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. రమ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబీకులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



రమ (ఫైల్)

ఇంటర్‌లో అద్భుత ఫలితాలు సాధించాం

- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించామని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతోపాటు ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. బుధవారం 55వ డివిజన్ కోమటిపల్లిలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అభినంద సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్ విద్యాసంస్థలకు దీటుగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు తక్కువ ఫీజుల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నాయన్నారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో కళాశాలకు చెందిన జె. అంజనా 997 మార్కులతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఎంపీసీ విభాగంలో కె. రుత్విక్ 996 మార్కులు, సేవితా 994 మార్కులు, కీర్తన 994 మార్కులు, జి.వర్షిణి 993 మార్కులు, సాత్విక 992 మార్కులు, పల్లవి 992 మార్కులు, గాయత్రేణి 992 మార్కులు, కె. హాసిని 992 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో జి. తరుణ్ 468 మార్కులు, ఎ.నిచిత 468 మార్కులు, కె. సహస్ర 467 మార్కులు, శ్రీవర్షిణి 467 మార్కులు, పి.సిరిచందన 467 మార్కులు, దేశిమి 467 మార్కులు, కె.వర్షిత 467 మార్కులు, సాత్విక 467 మార్కులు, కె. శ్రీకాంత్ 467 మార్కులు, బన్ని 467 మార్కులు, ఎ.ధీరజ్ 467 మార్కులు, కె. గీతాంనిహారి 467 మార్కులు, హాసిని 467 మార్కులు, సాయినాథ్ 466 మార్కులు, బైపీసీ విభాగంలో తారీమ్ 438 మార్కులు, సామఫి రాథోస్ 438 మార్కులు, హాసిని 437 మార్కులు, మస్విని 436 మార్కులు సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుష్కరాల పనుల్లో వేగం పెరగడం లేదు



సరస్వతీఘాట్ విస్తరణ పనులు పరిశీలిస్తున్న శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్

కాళేశ్వరం: ఆశించిన స్థాయిలో పుష్కరాల అభివృద్ధి పనుల్లో వేగం పెరగడం లేదని, పనులను అధికారులు, కాంట్రాక్టర్లు సీరియస్‌గా తీసుకోవాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఆదేశించారు. బుధవారం సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దార్మిక సలహాదారు గోవిందహరితో కలిసి కాళేశ్వరంలో పుష్కరాల అభివృద్ధి పనులు పరిశీలించారు. వీఐపీ(సరస్వతి) ఘాట్ వద్ద పుష్కర ఘాట్ విస్తరణ పనులు చూశారు. గోదావరి నీటిమట్టంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జరుపుతున్న కార్యక్రమమని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

సుబేదారిలో కారు బోల్తా.. యువకుడి దుర్మరణం

- సెల్ఫ్ డ్రైవింగ్ చేస్తుండగా ఘటన

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఇంటర్ మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాననే ఆనందంలో నమిండ్ల అభిషేక్ (18).. సెల్ఫ్ డ్రైవ్ కారు తీసుకుని స్నేహితులతో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.



డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టిన కారు, పక్కన అభిషేక్ మృతదేహం

రజతోత్సవానికి ముస్తాబు



బీఆర్ఎస్ రజతోత్సవ సభావేదిక



వేదికకు కుడివైపున ఏర్పాటు చేసిన రజతోత్సవ సభ చిహ్నం

భారత రాష్ట్ర సమితి పాతికేళ్ల పండుగకు చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి – చింతలపల్లి శివారులో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో సభావేదిక, సభకు హాజరయ్యే జనం కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా కూర్చునేందుకు బారికేడ్లు అమర్చారు. ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, గోపాల్‌పూర్ శివార్లలో 1,200 ఎకరాలకు పైగా భూసేకరణ చేశారు. ఇందులో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పార్కింగ్ కోసమే కేటాయించారు. వేదికకు ఇరువైపులా కేసీఆర్, కేటీఆర్ నిలువు కటౌట్లతో రజతోత్సవ చిహ్నాలు ఏర్పాటు చేశారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

గురిపెట్టి సివిల్ కొట్టారు..

సత్తా చాటిన జీఆర్‌పీ కానిస్టేబుల్ కుమారుడు

- మూడో ప్రయత్నంలో 814 ర్యాంక్ సాధించిన విక్రమ్
- ప్రస్తుతం నెల్లూరులో ఐబీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు
- గ్రూప్–1లోనూ ర్యాంకు..



గంగాధరి విక్రమ్

ఖిలా వరంగల్: బాల్యంనుంచే సివిల్స్ ప్రాధాన్యత, ఆ పోస్టులో దక్కే గౌరవాన్ని వరంగల్ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తండ్రి అతని కుమారుడికి వివరించారు. తండ్రి మాటలను శాసనంగా తీసుకున్న ఆ కుమారుడు కష్టపడి చదివాడు. తాజాగా విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 814 ర్యాంకు సాధించాడు. హనుమకొండ రాంనగర్ గోగుల్ నగర్‌కు చెందిన జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ గంగాధరి సుదర్శన్, అరుణ దంపతుల మొదటి కుమారుడు విక్రమ్ కాకతీయ యూనివర్సిటీలో 2016లో బీటెక్ పూర్తి చేశాడు. 2023లో ఐబీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికై నెల్లూరులో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్–1లో ఫలితాల్లో మెరుగైన ర్యాంకు రావడంతో డీఎస్పీ లేదా అడిటర్ అధికారిగా వచ్చే అవకాశం ఉంది. కాగా, ఐబీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఉండగా ఢిల్లీలో లాంగ్‌టర్మ్ సివిల్ సర్వీస్ కోచింగ్ తీసుకున్నారు. వరుసగా రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా విక్రమ్ అధైర్యపడలేదు. మూడో ప్రయత్నంలో ఆలిండియాలో 814వ ర్యాంక్ సాధించి తన సత్తా చాటారు. ఈ మేరకు బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆయన తండ్రి రాజును పలువురు అధికారులు కలిసి అభినందించారు.

విద్యా కార్యక్రమాలు, ప్రగతిపై సమీక్ష

- అధికారులతో సమావేశమైన విద్యాకమిషన్ చైర్మన్ మురళి
- అంతకుముందు పాఠశాల, కళాశాలల తనిఖీ



పింగిళి మహిళా డిగ్రీ కాలేజీలో జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ అకునూరు మురళి, పక్కన డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వరంగల్ నగరంలో బుధవారం పర్యటించారు. పలు విద్యాసంస్థలను పరిశీలించిన అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనేది అధికారులనుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. నాణ్యమైన విద్యను అన్ని సదుపాయాలతో అందించేలా ఓ మోడల్‌గా 'పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది విద్యాకమిషన్ ప్రతిపాదించిందని, ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఆ స్కూల్స్ ఎలా ఉంటాయో మోడల్‌గా పలు అంశాలను ఆయన వివరించారు. అధికారులనుంచి అభిప్రాయాలు తీసుకున్నారు.

వసతుల పరిశీలన..

హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీఅండ్‌పీజీ కళాశాల, జూనియర్ కాలేజీలను ఆకునూరు మురళి సందర్శించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి సరిపోవడం లేదని, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చరిత్ర విభాగం జాతీయ సదస్సు పరిశోధన పత్రాల ఐఎస్ఎస్ఎన్‌యూ జీసీ కేర్ జర్నల్‌ను మురళీ చేతులమీదుగా ఆవిష్కరించారు. అదేవిధంగా హనుమకొండలోని వడ్డెపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించారు. పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లో తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఉపాధ్యాయులు చేసిన ఎస్ఏ -2 పరీక్షల జవాబుపత్రాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎంఈఓ నెహ్రూ, పింగిళి ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

- రాజీవ్ యువ వికాసం అర్హులకు బ్యాంకు ద్వారా రాయితీ అందించాలి
- హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



గర్భిణులకు సీమంతం జరుపుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య, మహిళా అధికారులు

హన్మకొండ: రాజీవ్ యువ వికాసం అమలులో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ, ఎస్సీ, ట్రైబల్, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా దాదాపు రూ.63 కోట్ల ద్వారా జిల్లాలో వివిధ యూనిట్లను నెలకొల్పేందుకు అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మండల స్థాయి ఎంపిక కమిటీ మే 10 నాటికి ఎంపిక చేసి జాబితా సమర్పించాలన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి

ప్రతీ ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పోషణ పక్షం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి, జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, ఆయుష్ వైద్యుడు డాక్టర్ మహేందర్, జిల్లా న్యూట్రీషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సరళ, సీడీపీఓలు విశ్వజ, స్వరూప, స్వాతి, పోషణ అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ టి.సుమలత, జిల్లా మిషన్ శక్తి కో–ఆర్డినేటర్ డి.కళ్యాణి, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకట్రాం, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జ్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలి : కలెక్టర్



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

సాక్షి, వరంగల్: జిల్లాలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ త్వరగా జారీ చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్, భూగర్భ జలాల పరిరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవితో కలిసి బుధవారం ఆమె సమీక్ష చేశారు. 25 శాతం రాయితీతో ఈనెల 30 వరకు చివరి గడువు ఉన్నందున ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

ఇంకుడు గుంతల వివరాలు సేకరించాలి..

జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించడంలో భాగంగా ప్రతి 200 చదరపు మీటర్లకు పైన ఉన్న ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. ఇంకుడు గుంతల వివరాలు సేకరించి నివేదికలు వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు.

పారదర్శకంగా వెరిఫికేషన్ చేయాలి

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఐడీ కార్డులు, క్యాపులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాలతో పాటు మున్సిపాలిటీలకు 86 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు.. వృద్ధుడి మృతి



సోమనర్సయ్య మృతదేహం

లింగాలఘణపురం: కారు.. బైక్ ఢీకొని అదుపు తప్పి ఎదురుగా ఆగి ఉన్న రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం జనగామ – సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల సమీపం కాటన్‌మిల్లు వద్ద జరిగింది. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నారపల్లికి చెందిన తీగల సోమనర్సయ్య(80), తన భార్య అన్నపూర్ణ, కుమారుడు శ్రీధర్, కోడలు ప్రణీతతో కలిసి కారులో తుంగతుర్తిలో బంధువుల వివాహానికి హాజరై తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో కారు నెల్లుట్ల సమీపంలో జనగామ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న రఘునాథపల్లి మండలం బాంజీపేటకు చెందిన హరీశ్‌ను ఎ దురుగా ఢీకొని అదుపు తప్పి ఎదురుగా ఆగి ఉన్న రెడీమిక్స్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న సోమనర్సయ్యతోపాటు కుటుంబ సభ్యులు, ద్విచక్రవాహనదారుడు హరీశ్ గాయపడగా 108 సిబ్బంది నరేశ్, బిల్లా రాజు జనగామ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమనర్సయ్య మృతి చెందాడు. గాయాలైన అన్నపూర్ణ, శ్రీధర్, ప్రణీతను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హరీశ్ జనగామ ఏరియా ఆ స్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ వివరించారు. కాగా, జనగామ – సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల పరిధిలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.